క్లుప్తంగా

నేడు 10 గ్రామాల్లో ధర్మశ్రీ ప్రచారం

బుచ్చెయ్యపేట: మండలంలోని పది గ్రామాల్లో చోడవరం నియోజకవర్గ అభ్యర్థి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు తెలిపారు. ఉదయం 7 గంటలకు గొర్లెపాలెంలో ఇంటింటా ప్రచారం ప్రారంభమై పెదపూడి, సీతయ్యపేట, చింతపాక, కరక, తురకలపూడి, చిట్టెయ్యపాలెం, తైపురం, రాజాం, ఆర్. శివరాంపురం గ్రామంలో ముగుస్తుందన్నారు. అన్ని గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కె.కోటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఏఈ చంద్రశేఖర్‌రావు తెలిపారు. విద్యుత్ లైన్ల మెయింటెనెన్స్ పనుల నిర్వహణలో భాగంగా గొండుపాలెం, కె.కోటపాడు, గుల్లేపల్లి, చౌడువాడ, మల్లంపాలెం గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండబోదన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

రోలుగుంట: విద్యుత్ లైను మరమ్మతుల రీత్యా రోలుగుంట 33/11 కె.వి సబ్ స్టేషన్ పరిధి గ్రామాల్లో శుక్రవారం సరఫరా నిలిపివేస్తున్నట్టు నర్సీపట్నం డివిజన్ ఈఈ డి.వి.రామకృష్ణారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకూ రోలుగుంట, శరభవరం, కొంతలం, భోగాపురం, కొమరవోలు, కె.నాయుడుపాలెం, కొవ్వూరు, అంట్లపాలెం, కంచుగుమల, కొండపాలెం, పడాలపాలెం, ఓలం ఆగ్రో, సన్ ఫుడ్ కార్పొరేషన్ జీడిపిక్కల కర్మాగారం ప్రాంతాల్లో సరఫరా ఉండబోదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని రోలుగుంట ఏఈ పద్మనాభం విజ్ఞప్తి చేశారు.

కె.జె.పురంలో వైఎస్సార్‌సీపీ ప్రచారం


కె.జె.పురంలో ప్రచారం చేస్తున్న నాయకులు

మాడుగుల రూరల్: వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతుగా కె.జె.పురం మేజర్ గ్రామ పంచాయతీలో గురువారం రాత్రి ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. స్థానిక నాయకులు, అభిమానులు ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమం, అభివృద్ధి గురించి ఓటర్లకు వివరించారు. అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధలకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. సర్పంచ్ జామి రమణబాబు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కాళ్ల రాము, మాజీ అధ్యక్షుడు కాళ్ల అప్పలనాయుడు, మళ్ల కన్నబాబు, మాజీ సర్పంచ్ పెంటకోట అప్పారావు, నాయకులు తోరాటి రూనీ, ఏఎంసీ డైరెక్టరు జగ్గప్పారావు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సేవలు

అనకాపల్లి: ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సేవలను ఆన్‌లైన్‌లో అందజేయనున్నట్టు జిల్లా ఉపాధి అధికారి కె.శాంతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఆపైన విద్యార్హతలు గల యువతీయువకులు ఉద్యోగ అవకాశాలు, తమ విద్యార్హతల నమోదు కోసం జిల్లా ఉపాధి కార్యాలయాన్ని సంప్రదించవలసిన అవసరము లేదని, ఆన్‌లైన్‌లో ఎంప్లాయింట్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. గతంలో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ చేసుకున్న నిరుద్యోగులు గడువుముగిసిన వెంటనే ఆన్‌లైన్‌లో రెన్యువల్ చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు employment.ap.gov.in సంప్రదించాలని ఆమె కోరారు.

సాయిరామ్‌శంకర్ ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న సాయిరామ్ శంకర్

గొలుగొండ : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వల్ల పేద ప్రజలకు ఎంతో మేలు జరిగిందని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సోదరుడు సాయిరామ్ శంకర్ తెలిపారు. ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాత్రి కంఠారం పంచాయతీ శివారు అప్పన్నపాలెం, అడ్డల్లోవ సుద్దలపాలెం, పెసరాడ తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. గిరిజన గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
7997958337, 7075709854, 7997958336

చంద్రబాబు కుట్రతోనే పింఛన్ పాట్లు

వలంటీర్ల సేవలు నిలుపుదల చేయడంతో సకాలంలో అందని పింఛన్ సొమ్ము


వడ్డాది ఐవోబీ వద్ద పింఛన్ నగదు కోసం వృద్ధుల పాట్లు

బుచ్చెయ్యపేట: ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ నగదు ఇంటికి రాకుండా అడ్డుకున్న తెలుగుదేశం పార్టీపై పింఛన్‌దారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ఈ నెల పింఛన్ నగదును ప్రభుత్వం లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో జమ చేసింది. దీంతో పలు గ్రామాల వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు వడ్డాది, సీతయ్యపేట, రాజాం, బుచ్చెయ్యపేట, విజయరామరాజుపేట, ఆర్. భీమవరం గ్రామాల్లో బ్యాంకుల వద్దకు పింఛన్ డబ్బులు తీసుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు. మే నెల కావడంతో తీవ్రంగా ఎండ ప్రభావం ఉంది. వడగాడ్పులు, ఉక్కపోతలో బ్యాంకులకు వెళ్లి పింఛన్ నగదు పొందడానికి గంటలు తరబడి వేచి ఉండటంతో మండిపడుతున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లారేసరికి ఇంటికొచ్చి వలంటీర్ అందించే పింఛన్ చేతికందకుండా తెలుగుదేశం పార్టీ నాయకులే ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారంట అని ఒకరికొకరు చెప్పుకుంటున్నారు. మనల్ని ఇబ్బందులు పెడుతున్న టీడీపీ నాయకులకు తగిన గుణపాఠం తప్పదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 35 గ్రామ పంచాయతీలో 10,840 మంది పింఛన్‌దారులు ప్రతి నెలా పింఛన్ నగదు అందుకుంటున్నారు.

దేవరాపల్లి: పింఛన్ సొమ్ము కోసం అవ్వాతాతలకు అవస్థలు తప్పడం లేదు. ప్రతి నెలా ఒకటో తేదీన సూర్యోదయం కాకముందే తలుపు తట్టి పింఛన్ సొమ్ము అందించే వలంటీర్లపై చంద్రబాబు, టీడీపీ నేతలు, నిమ్మగడ్డ రమేష్‌తో ఈసీకి ఫిర్యాదు చేయించి వలంటీర్ల సేవలను నిలిపివేయించారు. ఈ నేపథ్యంలో ఇంటింటి పింఛన్ల పంపిణీ ఆగిపోయింది. దీంతో గత నెలలో సచివాలయాల వద్ద అందజేసిన అధికారులు, ఈ నెల లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. దీంతో అవ్వాతాతలు ఉదయం 8 గంటల నుంచి బ్యాంకుల వద్దకు చేరుకొని బారులు తీరారు. బ్యాంకులన్నీ పింఛన్‌దారులతో కిక్కిరిసిపోయాయి.


దేవరాపల్లిలో ఎండ తీవ్రతను తట్టుకోలేక బ్యాంక్ ఎదుట సేద తీరుతున్న అవ్వాతాతలు

సుదూర గ్రామాల నుంచి మండుటెండలో వచ్చి గంటలకొద్దీ పడిగాపులు కాయాల్సిన దుస్థితి దాపురించింది. దేవరాపల్లిలోని ఎస్‌బీఐ, ఎస్‌బీఐ బీసీ పాయింట్, యూకో బ్యాంక్‌ల వద్ద ఇక్కట్లకు గురయ్యారు. కొందరు పండుటాకులు ఎండ తీవ్రతతో విలవిల్లాడిపోయారు. బ్యాంకు ఖాతాలు ఆధార్, ఫోన్ నంబర్లకు లింక్ కాకపోవడం, బ్యాంక్ ఖాతా వినియోగంలో లేకపోవడం కారణంగా పింఛన్ సొమ్ము జమ కాకపోవడం, ఒక్కొక్కరికి రెండు బ్యాంక్ ఖాతాలు ఉండటంతో ఏ ఖాతాలో జమ అయిందో తెలియక అవస్థలు పడ్డారు. ఇంటి వద్దే పింఛన్లు అందుకున్న తమను ఇన్ని ఇబ్బందులకు గురిచేసిన చంద్రబాబు సహా టీడీపీ నాయకులకు తమ ఉసురు తగులుతుందని శాపనార్థాలు పెట్టారు.

రెండో రోజు పింఛన్ల పంపిణీ

మాడుగుల రూరల్: సామాజిక పింఛన్లు గురువారం రెండో రోజు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక రోగులకు, దివ్యాంగులకు, బెడ్ పేషెంట్లు రెండు రోజులుగా మండలంలో 2,932 మందికి గాను 2,626 మందికి అందజేసినట్లు ఎంపీడీవో ఆర్. కాశీ ప్రసాదురావు గురువారం తెలిపారు. డీబీటీ ద్వారా బ్యాంకుల నుంచి 9,020 మందికి గాను 8,758 మంది పింఛన్ల నగదు విత్‌డ్రా చేసుకున్నారన్నారు. మండలంలో 568 మంది మాత్రమే ఇంకా పింఛను తీసుకోవలిసి ఉందన్నారు. దీర్ఘకాలిక రోగులకు, దివ్యాంగులకు సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. చీడికాడ మండలంలో డీబీటీ ద్వారా 6,548 మందికి గాను 6,468 మందికి, ఇంటింటికి వెళ్లి 2,265 మందికి గాను 2,013 మందికి పంపిణీ చేశారు. దేవరాపల్లి మండలంలో డీబీటీ ద్వారా 7,774 మందికి గాను 7,710 మందికి, ఇంటింటికి సంబంధించి 2,637 మందికి గాను 2,296 మందికి, కె. కోటపాడు మండలంలో డీబీటీ ద్వారా 7,741 మందికి గాను 7,605 మందికి, ఇంటింటికీ సంబంధించి 3,316 మందికి గాను 3,068 మందికి పంపిణీ చేసినట్లు ఆయా మండలాల ఎంపీడీవోలు తెలిపారు. డీబీటీ ద్వారా పింఛన్లు తీసుకునే లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. సర్వర్ పని చేయక గంటల కొద్దీ నెట్ పాయింట్లు వద్ద నిరీక్షించారు. కొన్ని ప్రైవేటు నెట్ సెంటర్ల వద్ద రూ.వెయ్యికి రూ.10 వంతున కమీషన్‌గా తీసుకుని ఇచ్చారు.


తెలకలదీపంలో వృద్ధుడికి పింఛను అందజేస్తున్న సచివాలయ సిబ్బంది


కె.జె.పురంలో గ్రామీణ బ్యాంకు నెట్ పాయింట్ వద్ద సర్వర్ పని చేయక నిరీక్షిస్తున్న వృద్ధులు

గంటలకొద్దీ నిలబడితే..రేపు రమ్మన్నారు



రైవాడ నుంచి రెండు కిలోమీటర్ల మేర కాలినడకన ఉదయం 8 గంటలకు దేవరాపల్లి వచ్చాను. స్టేట్ బ్యాంక్ వద్ద లైన్లో నిలబడితే తీరా ఒంటి గంట సమయంలో మరలా రేపు రండి అని చెప్పి తిరిగి పంపారు. తీవ్రమైన ఎండల్లో ఇబ్బందులకు గురి చేస్తున్న వారికి మా ముసిలోళ్ల ఉసురు తగులుతుంది. గడప దాటకుండా ఇంటి వద్దే పింఛన్ సొమ్ము అందించే వలంటీర్లను అడ్డుకోవడం అన్యాయం. ఎండ తీవ్రతతో గడప దాటని తమను బ్యాంకు‌లు చుట్టూ తిరిగేలా చేశారు.

–కొయ్య దేముడమ్మ, వృద్ధురాలు, రైవాడ

సంక్షేమ పాలనకే మద్దతుగా నిలవాలి

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ ప్రచారం

దేవరాపల్లి: సంక్షేమ పాలన కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ ఓటర్లకు సూచించారు. గురువారం దేవరాపల్లి బండారు కల్లాల్లో రైతులను కలిసి దేవరాపల్లిలో ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని చూసి స్థానికులైన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ముత్యాలనాయుడు, ఈర్లె అనురాధలకు ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నిత్యం తారువలో అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవ చేస్తున్న వారిని ఆశీర్వదించాలని కోరారు. ఆపదలో అర్ధరాత్రి తలుపు తట్టిన ఆదుకునేందుకు సిద్ధంగా ఉంటారన్నారు. స్థానికేతురులైన టీడీపీ, బీజేపీ అభ్యర్థుల మాయ మాటలు నమ్మి మోసపోవద్దని, ఎన్నికయ్యాలు పూర్తయితే వారంతా కనిపించే పరిస్థితి ఉండదన్నారు. కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరదపురెడ్డి లలితానాయుడు, సీనియర్ నాయకుడు గండిపడాల అప్పలరాజు, జేసీఎస్ మండల కన్వీనర్ కేవీ రమణ, వరదపురెడ్డి చంద్రరావు, రాష్ట్ర మహిళా సంయుక్త కార్యదర్శి రొంగలి నారాయణమ్మ, వేచలపు వాణి, గంగవంశం రజనీ, వరదపురెడ్డి రమేష్ పాల్గొన్నారు.


దేవరాపల్లి రైతులను కలిసి ప్రచారం చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ

టీడీపీని నమ్మితే నట్టేట ముంచుతారు

ఎన్నికల ప్రచారంలో ఎంపీపీ రాజారామ్

మాడుగుల: టీడీపీ, బీజేపీ అభ్యర్థులు అధికారం కోసం గ్రామాలకు మాయమాటలు చెబుతున్నారని, వాటిని నమ్మితే నట్టేట ముంచుతారని ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ తెలిపారు. గురువారం తాటిపర్తి పంచాయతీలో బిళ్లలపాలెం, గరికిబంద, చిన, పెద కూర్మనాథపురం, ద్వారకానగర్, లక్ష్మింపేట, ఆనందపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ ఆయన తిరిగి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. ఐదేళ్ల నుంచి అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధి చూసి వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, ఈర్లె అనురాధలకు ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. తాటిపర్తి పంచాయతీలో గిరి గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించిన అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడుకు మద్దతుగా నిలివాలని కోరారు. గతంలో ఇక్కడ గ్రామాలు ఎలా ఉన్నాయో, ఐదేళ్లలో ఎంతగా మార్పు చెందాయో గుర్తుంచుకోవాలన్నారు. సర్పంచ్ అల్లంగి గౌరీదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు అల్లంగి సంజీవరావు, సీరా సన్నమ్మ, సీరా తలుపులునాయుడు, షేక్ దేముడు, కాత రమణ, గిరిజన సంఘ నాయకులు, గిరి మహిళలు, తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీకి ఓటేయాలని బిళ్లలపాలెం గిరిజనులను అభ్యర్థిస్తున్న ఎంపీపీ రాజారామ్

నేడు 10 గ్రామాల్లో అనురాధ ఎన్నికల ప్రచారం

మాడుగుల: మండలంలోని పది గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ తెలిపారు. ఉదయం 9 గంటలకు జాలంపల్లి పంచాయతీలో ప్రచారం ప్రారంభిస్తారన్నారు. ఎల్. పొన్నవోలులో 11కు మధ్యాహ్నం 1.30 గంటలకు జేడీపేట పంచాయతీలోని గవరవరం, కొండలపాడు, 2కు సత్యవరం భోజన విరామం, డి. గొటివాడలో సాయంత్రం 3కు, సాగరంలో 4కు, ఎం. కె.వల్లాపురంలో 5కు, ఎం. కోటపాడులో 6కు, వంటర్లపాలెంలో 7కు, కేజేపురంలో 8 గంటలకు ప్రచారం చేస్తామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, విధిగా హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంపై గురువారం ఆయా గ్రామాలు, నాయకులు, కార్యకర్తలతో సమీక్షించారు.

గాయపడ్డ వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు పరామర్శ

దేవరాపల్లి: స్థానిక సంతతోటలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త గొర్లి సన్నిబాబును గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు. రెండు రోజుల క్రితం దేవరాపల్లిలో ఇంటింటా ప్రచారానికి వచ్చి ప్రమాదశాత్తు తన ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోయాడు. కాలికి తీవ్ర గాయమైంది. అతడికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా నిచ్చారు. పరామర్శించిన వారిలో కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరదపురెడ్డి లలితానాయుడు, సీనియర్ నాయకుడు గండిపడాల అప్పలరాజు, జేసీఎస్ మండల కన్వీనర్ కేవీ రమణ, వరదపురెడ్డి చంద్రరావు ఉన్నారు.


గాయపడ్డ సన్నిబాబును కలిసిన దేవరాపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు

అభివృద్ధికి కేరాఫ్ మాడుగుల

- 5 ఏళ్లలో రూ.48 కోట్లతో అభివృద్ధి
- వైఎస్సార్‌సీపీ పాలనలో మారిన రూపురేఖలు


మాడుగులలో సర్వాంగ సుందరంగా అగ్రి ల్యాబ్

మాడుగుల: వైఎస్సార్‌సీపీ పాలనలో మాడుగుల పట్టణం అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. వీధికో నూతన సీసీరోడ్డు, డ్రైనేజీలు, ఇంటింటికీ కుళాయిలు, ఇలా ఒకటేమిటి రూ.48 కోట్లతో ఐదేళ్లలో పలు అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక కృషితో రూ.2 కోట్లతో నిర్మించిన సచివాలయ భవనాలు, ఆర్బీకేలు, వెల్‌నెస్ కేంద్రాలు దర్శనమిస్తున్నాయి. కోటి రూపాయలతో ఉప ఖజానా కార్యాలయం, రూ.2 కోట్లతో ప్రధాన రాజవీధి, మోదమాంబ కాలనీకి సీసీరోడ్లు ఏర్పాటు చేశారు. రైతు సేవల కోసం రూ.80 లక్షలతో అగ్రి ల్యాబ్, రూ.1.40 కోట్లతో పీఆర్ వసతి గృహ నిర్మాణం, రూ.10 కోట్లతో ఇంటింటికి కుళాయిలు, మూడు జగనన్న కాలనీలు, మోదమాంబ కాలనీలో రూ.35 లక్షలతో కల్యాణ మండపం, రూ.5.50 కోట్లతో 30 పడకల ఆస్పత్రికి నూతన భవన నిర్మాణం, నవర, దొర్లవీధుల్లో రూ.35 లక్షలతో సీసీ కమ్ డ్రైనేజీలు, రూ.43 లక్షలతో గణేష్ కాలనీలో సీసీడ్రైనేజీలు, కనికరమాత కాలనీలో రూ.10 లక్షలతో సీసీ కమ్ డ్రైనేజీలు, జగ్గన్నసావిడిలో రూ.43 లక్షలతో సీసీ డ్రైనేజీలు, రూ.1.3 కోట్లతో కోల్డ్ స్టోరేజీ భవనాలు, హైస్కూల్ కాలనీలో రూ.1.3 కోట్లతో సీసీరోడ్లు, కమ్ డ్రైనేజీలు, జగనన్న కాలనీతోపాటు రామచంద్రాపురానికి రూ.60 లక్షలతో పక్కా రోడ్డు, రూ.23 లక్షలతో అంబేడ్కర్ కాలనీలో సీసీ డ్రైనేజీలు నిర్మించారు. రూ.7.40 కోట్లతో డి.గొటివాడ నుంచి సాగరం మీదుగా తాచేరుపై వంతెనతో పాటు రోడ్డు పనులు పూర్తయ్యాయి.


మాడుగులలో సీసీ డ్రైనేజీలు


మాడుగుల పట్టణంలో సచివాలయం, ఆర్బీకేలు


ఉద్యానవన శాఖ కోల్డ్ స్టోరేజీలు

మాడుగుల పట్టణ రుణం తీర్చుకుంటా



రెండు దఫాలుగా ఆదరించిన మాడుగుల పట్టణాన్ని రూ.48 కోట్లతో నా తండ్రి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఇప్పటికే అభివృద్ధి చేశారు. మూడో మహిళా అభ్యర్థిగా నేను మాడుగుల వచ్చాను. మీ బిడ్డగా ఆశీర్వదించండి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, తన తండ్రి సహకారంతో ఇంకా మిగిలి ఉన్న పనులతో పాటు పురాతన పార్థసారథి ఆలయంపైకి రహదారి, జలాశయాల ఆధునీకరణ, ఆలయాల అభివృద్ధి, సీసీరోడ్లు, మార్కెట్ కమిటీకి పక్కా భవనాలు, తదితర అభివృద్ధి పూర్తి చేస్తాను.

– ఈర్లె అనురాధ, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మాడుగుల

మీ ఇంటి ఆడబిడ్డగా ఆశీర్వదించండి

- టీడీపీ, బీజేపీ అభ్యర్థులకు ఓటుతో బుద్ధి చెప్పాలి
- 23 గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ ఎన్నికల ప్రచారం


వి.సంతపాలెంలో అనురాధ ప్రసంగాన్ని వింటున్న ప్రజలు


కొరువాడలో అనురాధ వెంట ప్రచారంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు

కె.కోటపాడు: మీ ఇంటి ఆడబిడ్డగా తనను ఆశీర్వదించాలని మాడుగుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ కోరారు. అనుక్షణం ప్రజల కష్టసుఖాలలో తోడుగా ఉంటానని తెలిపారు. మండలంలోని 23 గ్రామాల్లో గురువారం ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ముందుగా ఆనందపురంలో ప్రచారాన్ని ప్రారంభించిన ఆమెకు సర్పంచ్ వంటాకు అప్పాజి ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. మహిళలు హారతులు పట్టి విజయీభవ అంటూ దీవించారు. అనంతరం వి.సంతపాలెం, వారాడ, ఆర్.వై.అగ్రహారం, ఉగ్గినవలస, పోతనవలస, కొరువాడ, డి.అగ్రహారం, గవరపాలెం, కె.జె.పురం, కొత్త అగ్రహారం, సూర్రెడ్డిపాలెం, సింగన్నదొరపాలెం, దాలివలస, ఎ.భీమవరం, మేడిచర్ల, రొంగలినాయుడుపాలెం, పైడంపేట, గొండుపాలెం, ఎ.కోడూరు, పొడుగుపాలెం, యడ్లవానిపాలెం గ్రామాల్లో ప్రచారాన్ని రాత్రి వరకూ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ మాట్లాడుతూ ఐదేళ్లలో మాడుగుల నియోజకవర్గాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మోడల్‌గా తీర్చిదిద్దారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వంద తారురోడ్లు వేసి ప్రజల రవాణా కష్టాలు తీర్చారన్నారు. అదే స్ఫూర్తితో తాను ఎమ్మెల్యేగా గెలుపొంది సేవ చేస్తానన్నారు. ఐదేళ్ల పాలనలో 99 శాతం హామీలు అమలు చేసి సీఎం జగన్ ప్రస్తుతం ప్రకటించిన మేనిఫెస్టోపై ప్రజలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారన్నారు. చంద్రబాబు మాదిరిగా పూటకో అబద్ధం చెప్పడం లేదన్నారు. చేసిందే చెబుతున్నారన్నారు. కడప, పరువాడ ప్రాంతాలకు చెందిన బీజేపీ, టీడీపీ అభ్యర్థులకు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. ఈ నెల 13న ఎన్నికల్లో ఎంపీగా బూడి ముత్యాలనాయుడుకు, ఎమ్మెల్యేగా తనకు ఫ్యాన్ గుర్తుపై వేసి మంచి మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీలు రొంగలి సూర్యనారాయణ, లెక్కల నాగ విజయలక్ష్మి, పార్టీ దేవరాపల్లి మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, సర్పంచ్, ఎంపీటీసీలు వేచలపు దొరబాబు, లెక్కల దేవీలత, గొర్రుపోటు వెంకటరావు, దొగ్గ రాము, చీపురుపల్లి అచ్చిబాబు, పైడినాయుడు, గున్నమ్మ, జాగరపు వెంకట రామలక్ష్మి, నెక్కల గోపి, తోట కనకరాజు, నెక్కల పెంటయ్య, గొర్లె సూర్యనారాయణ, సిమ్మ అంకుల్, కోట సూర్యనారాయణ, చీపురపల్లి గోవింద, రొంగలి వెంకట రమణ, లాలం నాని, ఆదిరెడ్డి రాము నాయుడు, భూమిరెడ్డి దేముడు, తర్రా సన్యాసమ్మ, ఆదిరెడ్డి వెంకటరావు, బొడ్డు తాతయ్యబాబు, పైల పైడితల్లమ్మ, యడ్ల వెంకటరావు, గొర్రుపోటు రామలక్ష్మి, రొంగలి రమేష్, బండారు దేముళ్లు, దొగ్గ ఉమాశంకర్, వంటాకు శ్రీను, రొంగలి రాము పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి జగతా ఇంటింటి ప్రచారం

చోడవరం రూరల్: చోడవరం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జగతా శ్రీనివాసరావు గురువారం గోవాడ, అంభేరుపురం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ఎంపీ అభ్యర్థి వేగి వెంకటేష్‌కు హస్తం గుర్తుపై ఓటెయ్యాలని అభ్యర్థించారు. ఇండియా కూటమి పక్షం సీపీఎం నాయకుడు ఎస్.వి. నాయుడు, శనివాడ నూకరాజు, ఇ.చిరంజీవి పాల్గొన్నారు.


అనురాధకు దిష్టి తీస్తున్న మహిళలు

మాడుగులలో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీను...

మాడుగుల రూరల్: కాంగ్రెసు పార్టీ మాడుగుల నియోజకవర్గ అభ్యర్థి బొడ్డు శ్రీనివాసరావు గురువారం మాడుగుల, కె.జె.పురం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వేగి వెంకటేష్ సతీమణి ప్రత్యూషతో కలిసి మాడుగుల మార్కెట్ వద్ద ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా పలు హామీలు వివరించారు. హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి పడాల కొండలరావు, పార్టీ మండల అధ్యక్షుడు బాలిబోయిన అప్పారావు, ఎస్సీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ బుడబండి రాజు, యువజన విభాగం అధ్యక్షుడు ఏసురాజు, చీకటి పరిదేశి, సీపీఎం నాయకులు రొంగలి దేముడునాయుడు, కచ్చా సతీష్ పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి

- ఎస్పీ మురళీకృష్ణ



ఏఆర్ ఎస్ఐ సూరిబాబు దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ కె.వి.మురళీకృష్ణ

తుమ్మపాల: పోలీసు సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వహించాలని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అన్నారు. పదవీ విరమణ చేసిన ఏఆర్ ఎస్ఐ కె.సూరిబాబు దంపతులను ఎస్పీ కార్యాలయంలో గురువారం ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూరిబాబు విశేష సేవలందించారని చెప్పారు. కానిస్టేబుల్‌గా పోలీస్‌శాఖలో చేరి, ఎస్ఐ స్థాయికి ఎదిగారని తెలిపారు. పోలీసు ఉద్యోగం చాలా ఒత్తిడితో కూడుకున్నదన్నారు. ప్రజలకు నేరుగా సేవలు అందించగలిగే ఈ ఉద్యోగంలో చేరడం చాలా గొప్ప అదృష్టంగా భావించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి.విజయభాస్కర్, పి.సత్యనారాయణరావు, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఏవో బి.శారద, ఇన్‌స్పెక్టర్లు సతీష్, మన్మథరావు, ఆర్ ఎస్ఐలు దిల్లేశ్వరరావు, ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నర్సీపట్నం డివిజన్:
నర్సీపట్నం : 9010234557
చోడవరం : 9010210265
మాడుగుల : 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com